

చెన్నై, పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (శ్రీహార్) సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సులో పాల్గొన్న అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ శాంత, శ్రీహార్ వైద్య నిపుణులు - న్యూస్‌టుడే, టీనగర్

ఆదివారం 9 జూన్ 2019

ఈనాడు తమిళనాడు

# అవసరం లేకుండా ఆధునిక చికిత్సలొద్దు: డాక్టర్ శాంత

**టీనగర్, న్యూస్‌టుడే:** క్యాన్సర్ రోగులకు వైద్యం చేసేటప్పుడు అవసరం లేకుండా ఆధునిక చికిత్స చేయరాదని ప్రముఖ వైద్యురాలు, అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంత పేర్కొన్నారు. రోగులను ఇబ్బంది పెట్టడం, అత్యాధునిక చికిత్స పేరిట భారం మోపడం సబబు కాదన్నారు. పోరూర్‌లోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ (శ్రీహెర్) ఆవరణలో 'కారికాన్- 2019' పేరిట ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగికి నాణ్యతతో కూడిన చికిత్స అందించాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, క్యాన్సర్ మందులు తయారు చేస్తున్న సంస్థల తీరును కూడా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోగికి ఎలాంటి చికిత్స చేయాలో నిర్ణయించే ముందు వైద్యులు రోగి కుటుంబ సభ్యులతో చర్చించాలని సూచించారు. వారు అంత భారాన్ని మోయగలరా, వారికి అత్యాధునిక చికిత్స కావాలా లేదా మామూలు వైద్యం కోరుకుంటున్నారా అనేది తెలుసుకొని ఆ మేరకు వైద్యం చేయాలన్నారు. అనంతరం శ్రీహెర్ వైస్ ఛాన్సలర్ విజయరాఘవన్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. క్యాన్సర్ చికిత్స పొందిన వారు 25 సంవత్సరాలకు పైగా జీవిస్తున్నారని గుర్తుచేశారు. క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. శ్రీహెర్ వైద్య నిపుణులు జగదీష్, బాలాజీ సింఘ్ తదితరులు పాల్గొన్నారు.